RNI NO.APTELU/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
సోమవారం । 31 । ఆగస్టు । 2026

భద్రాచలంలో పారంపర్య వైద్యుల రాష్ట్ర మహాసభలు

సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో నిర్వహణ

కొత్తగూడెం, ఆగస్టు 30 (తెలంగాణ వాణి):
పారంపర్య వైద్య మహాసంఘం (పీ.వీ.ఎం.ఎస్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర సలహాదారు మొక్కల వెంకటయ్య, ఉపాధ్యక్షుడు వైద్య రామంచి శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ వైద్య సుగుణారావు పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్సీబీ నగర్‌లోని మొక్కల వెంకటయ్య ప్లాంటేషన్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. భారతీయ సనాతన సంప్రదాయ వైద్యంలోని మూలాలు, మెలకువలు, అనుభవాలను పరస్పరం పంచుకోవడంతో పాటు వైద్య విజ్ఞానాన్ని మరింత విస్తరించేందుకు రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీ సీతారాముల సన్నిధి భద్రాచలంలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో జరిగే మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 400 మంది పారంపర్య వైద్యులు హాజరవుతారని తెలిపారు. భక్త మార్కండేయ పద్మశాలి భవన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి శైవక్షేత్ర పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శివ స్వామీజీ, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.
సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైద్య దొంత యాత్రి మహర్షి, ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వర్లు, కోశాధికారులు టి. దుర్గారాణి, వి. అరుణతో పాటు రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో 'మన్ కీ బాత్' మొక్కల రాజశేఖర్, హరిత దీక్షకురాలు చిన్నారి నైనిక రజువా, సభ్యులు వైద్య వి. నరసింహారావు, ఎం.డి. ముస్తఫా, శంకర్ బంగారి, రాయి లక్ష్మి, దశరథ్ రజువా, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

యూనియన్ బలోపేతంపై దృష్టి సారించాలి

ఐఎన్‌టీయూసీ నాయకులకు దిశానిర్దేశం చేసిన ఎం.డి. రజాక్

కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 30 (తెలంగాణ వాణి):
ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి అభ్యున్నతితో పాటు యూనియన్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎం.డి. రజాక్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ఇటీవల జరిగిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ ఇచ్చిన దిశానిర్దేశాల మేరకు ఆదివారం రుద్రంపూర్‌లో ఐఎన్‌టీయూసీ నాయకులతో సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ సింగరేణి ప్రస్తుత పరిస్థితులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంస్థ భవిష్యత్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సింగరేణి భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త బొగ్గు గనులను ప్రారంభించాలని, సంస్థ భవిష్యత్తును కాపాడేందుకు దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త గనులు ప్రారంభిస్తేనే కార్మికుల సంక్షేమంతో పాటు సంస్థ ఆర్థిక బలోపేతం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.
సింగరేణి కార్మికుల పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మినహాయింపు, మారుపేర్ల సమస్య పరిష్కారం, సొంత ఇంటి కల పథకం అమలు వంటి అంశాలపై యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటాను ప్రకటించి త్వరగా కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం ఏరియాలో అండర్ గ్రౌండ్‌లో పనిచేస్తున్న జనరల్ అసిస్టెంట్లకు సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ పోస్టులు కల్పించాలని కోరారు.
కొత్తగూడెం ఏరియాలోని గనులు, ఓపెన్‌కాస్ట్ గనుల్లో వివిధ విభాగాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరారు. యూనియన్ నాయకులు కార్యోన్ముఖులై కార్మికుల సమస్యలపై తక్షణమే స్పందిస్తూ వారి సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు.
ఈ సమావేశంలో అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ బుటిక రాజేశ్వరరావు, సెంట్రల్, బ్రాంచ్ కమిటీ సభ్యులు సకినాల సమ్మయ్య, జిదుల రాజేశ్వరరావు, కాసర్ల సమ్మయ్య, మెంగని అశోక్, పోశం శ్రీనివాస్, రాజశేఖర్, ఫిట్ కార్యదర్శులు చిలుక రాజయ్య, గోపు కుమారస్వామి, ఎం.డి. సత్తార్ పాషా, ఈ. మోహన్‌రెడ్డి, డి. శంకర్‌బాబు, కే. నటరాజ్, సిహెచ్. సాగర్, జి. మల్లికార్జునరావు, అసిస్టెంట్ సెక్రటరీలు జల్లి కిరణ్, కే. కుమార్, కే. నాగేశ్వరరావు, వల్లాల సాంబమూర్తి, ఎం.డి. సవీర్, నాయకులు ఎస్.డి. యాకుబుద్దీన్, నాగుల శంకర్, ఎస్.కె. ఖాజాపాషా, బాబుదిన్, వెంకట్‌స్వామి, రాజేంద్రప్రసాద్, లెనిన్‌బాబు, దశరథం, రెడ్డి, రమాకాంత్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మార్పు కోసమే ఢిల్లీ పోరుయాత్ర

భద్రాద్రి జిల్లా నుంచి 500 మంది తరలింపు

హక్కుల సాధనకు పోరాటాలు తప్పవు: సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

కొత్తగూడెం, ఆగస్టు 30 (తెలంగాణ వాణి):
దేశంలో మార్పు కోసం ఢిల్లీ వేదికగా భారీ పోరాటయాత్ర, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుంచి సుమారు 500 మంది కార్మికులు, రైతులు, విద్యార్థులు, మహిళలు తరలివెళ్తున్నట్లు చెప్పారు. ఢిల్లీకి బయలుదేరిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెల రోజులుగా జిల్లాలోని గ్రామాలు, బస్తీల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఈ నెల 6 నుంచి 14 వరకు నిర్వహించిన జనచైతన్య యాత్రల ద్వారా ప్రజల్లో అవగాహన పెరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఢిల్లీలో జరిగే పోరాటంలో జిల్లా ప్రతి నిధులు క్రియాశీలకంగా పాల్గొంటారని, అక్కడ తీసుకునే నిర్ణయాల అమలుకు భవిష్యత్తులో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో మేయర్ మూడ్ గణేష్, జిల్లా నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, ఉప్పుశెట్టి రాహుల్, కంచర్ల జమ లయ్య, మువ్వా వెంకటేశ్వరరావు, డి. సుధాకర్, రాజబాబు, సర్పంచులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.